Aerospace university

| | | | | | |
|---|---|---|---|---|---|
| Pub Date: | 02 Dec 2015 | Publication: | Andhra Jyoti | Edition: | Bangalore |
| Journalist: | Bureau | Language: | Telugu | Page No.: | 7 |
| CCM: | 62.68 | MAV: | 30084.62 | Circulation | 15000 |




## వైమానిక పరిశోధనలకు ఊతమిచ్చేలా

# అంతరిక్ష వర్సిటీ




స్మరణ సంచిక ఆవిష్కరణ

**ఆంధ్రజ్యోతి ప్రతినిధి, బెంగళూరు:** ఇప్పటికే మనదేశంలో రకరకాల యూనివర్సిటీలు వచ్చేశాయి. తాజాగా ఈ జాబితాలోకి అంతరిక్ష విశ్వ విద్యాలయం కూడా చేరబోతోంది. వైమానిక పరిశోధనలకు మరింత ఊతమిచ్చేలా ఎయిరోస్పేస్ విశ్వవిద్యాలయం ఉంటుందని రాష్ట్ర మౌలిక సదుపాయాలు, సమాచార శాఖల మంత్రి రోషన్‌బేగ్ ప్రకటించారు. నగరంలో మంగళవారం ఆయన ఇండియా ఎంఆర్ఓ ఎయిరో స్పేస్ డిఫెన్స్ ఎక్స్‌పోను లాంఛనంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో విమాన నిర్వహణ మరమ్మతుల రంగంలో పరిశ్రమల పాత్ర అంతరిక్షం, రవాణా రంగాల్లో అవకాశాలు మేక్ ఇన్ ఇండియా ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చలు జరగనున్నాయి. తొలిరోజు సదస్సును ఉద్దేశించి ప్రసంగించిన మంత్రి రోషన్‌బేగ్ దేశ వైమానిక రాజధానిగా కర్ణాటక విలసిల్లుతోందని దేశంలోనే తొలి వైమానిక పారిశ్రామిక విధానాన్ని ప్రకటించిన రాష్ట్రం మనదేనన్నారు. దేవనహళ్ళి వద్ద వెయ్యి ఎకరాల ప్రదేశాన్ని వైమానిక రంగం కోసమే సెజ్ రూపంలో కేటాయించబోతున్నట్లు చెప్పారు. వైమానిక రంగ పరిధి, పాత్ర గణనీయంగా పెరుగుతున్నాయని నేడు పౌర విమానయాన రంగం సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. వైమానిక రంగంలో ఇప్పటికే కోర్సులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు ఎన్నో ఉన్నాయని వీటికి రానురాను పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేసేదిశలో ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందన్నారు. బెంగళూరులోనే ఎయిర్ షోను నిర్వహించాలని కేంద్ర రక్షణ శాఖా మంత్రికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య సూచించగా అందుకు ఆయన అంగీకరించారని చెప్పారు. ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన ఆశిష్‌దాస్ గుప్తా మాట్లాడుతూ ఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు నేరుగా విమాన సేవలను ప్రారంభించామన్నారు. ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ దూరం 16 గంటలన్నారు. మౌలిక సదుపాయాల శాఖ ముఖ్యకార్యదర్శి నందితా శర్మ మాట్లాడుతూ ఎయిరోస్పేస్ రంగంలో ఎంఆర్ఓ ప్రముఖ పాత్ర పోషిస్తోందని కొనియాడారు. బెంగళూరు వైమానికరంగం అత్యంత సహజంగా ఉందని ఈ రంగ ప్రగతికి విదేశీ పెట్టుబడులకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఓ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ పులకేసేన్, హెచ్ఏఎల్ సీఈఓ కావేరీ రంగనాథన్, ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశిష్‌దాస్ గుప్తా, మాక్స్‌ఎంఆర్ఓ సీఎండీ భరత్ మల్కానీ, కానియస్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ డాక్టర్ మిలింద్ పింప్రికార్, ఎంఎం యాక్టివ్ సైన్స్‌టెక్ మేనేజింగ్ డైరెక్టర్ జగదీశ్ పట్నాకర్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది.



ప్రదర్శన తిలకిస్తున్న మంత్రి రోషన్‌బేగ్



ప్రతిపాదిత ఎయిరో స్పేస్ పార్క్ నమూనా